సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



17,500 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయం సోమవారానికి 47.24 టీఎంసీలకు చేరుకుంది. పైనుంచి 17,500 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 550, ఉత్తరకాలువకు 5, దక్షిణ కాలువకు 5 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,550
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,666
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,866
నవర (8 గ్రాములు)	రూ.54,928

గరిష్టం/కనిష్టం
32.3 /28.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం మంగళవారం సాధారణంగా ఉండే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 63 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వరద బాధితులకు ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి నెల వేతనం



నెల్లూరు (బారకాసు): విజయవాడ వరద బాధితుల సహాయార్థం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తన వంతుగా ఒక నెల వేతనాన్ని విరాళంగా అందజేశారు. సోమవారం తన నెల వేతనం రూ.1.75 లక్షల చెక్కును పంపారు. ఆయన మాట్లాడుతూ భారీ వరద పోటెత్తి విజయవాడలో ఎంతో మంది ఆహారానికి కూడా ఇబ్బంది పడుతున్న తీరు తనను కలచి వేస్తుందన్నారు. త్వరగా ఈ విపత్తు నుంచి విజయవాడ ప్రజలు సురక్షితులు కావాలని కోరుకుంటున్నానని తెలిపారు.

జీఓ 115 రద్దు కోరుతూ నర్సుల ఆందోళన



ప్రభుత్వ పెద్దాస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

నెల్లూరు (అర్బన్): కాంట్రాక్ట్ పద్ధతిలో ఏళ్ల తరబడి స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్న తమకు తీవ్రనష్టం కలిగేలా ప్రభుత్వం నూతనంగా తెచ్చిన జీఓ నంబర్ 115ను రద్దు చేయాలని ఏసీఎస్ఆర్ ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్ నర్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి రూత్‌గ్రేస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రి వద్ద కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు ధర్నా చేశారు. తాము ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్నామన్నారు. తమను రెగ్యులర్ చేయాలని కోరుతున్నామన్నారు. అయితే తమను కాదని కేవలం ఒక ఏడాది కోర్సు మాత్రమే చేసిన ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చి వారిని స్టాఫ్ నర్సులుగా ప్రమోట్ చేయడం అన్యాయమన్నారు. 2010 నుంచి ఇప్పటి వరకు రెగ్యులర్ స్టాఫ్ నర్సుల నోటిఫికేషన్ ప్రకటించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పి.వేణు, నాయకులు శరత్ బాబు, మేరీమాధురి, లీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్టు ఇంజినీర్లు సోమవారం తెలిపారు. అందులో భాగంగా 1వ యూనిట్లో 456, 2వ యూనిట్లో 556 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. సాంకేతిక లోపం వల్ల 3వ యూనిట్లో విద్యుదుత్పత్తి నిలిపివేశామని తెలిపారు.

జిల్లాలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): ఈ నెల 14 నుంచి అక్టోబర్ 2 వరకు స్వభావ్ స్వచ్ఛత – సంస్కార్ స్వచ్ఛత పేరుతో జిల్లాలో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో సబ్‌కలెక్టరు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో స్వచ్ఛభారత్ మిషన్‌ను ప్రారంభించి పదేళ్లు అయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు, అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివస్ నిర్వహిస్తున్నారన్నారు. ఇందు కోసం జిల్లా స్థాయిలో 15 మంది అధికారులతో ప్రత్యేక స్టీరింగ్ కమిటీని నియమించామన్నారు. జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీపీఓ సుస్మిత, హౌసింగ్ పీడీ దయాకర్, డీఈఓ రామారావు, సర్వశిక్ష ఏపీఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

తల్లి చెంతకు బిడ్డ

నెల్లూరు (దర్గామిట్ట): నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో దొరికిన పసిబిడ్డను ఎట్టకేలకు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో మూడు నెలల పసిబిడ్డను ఓ తల్లి వదిలి వెళ్లిన విషయం విదితమే. బాలల సంరక్షణ సిబ్బంది బృందాలుగా ఏర్పడి తల్లిదండ్రుల కోసం గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు తల్లిదండ్రుల ఆచూకీ తెలుసుకుని ఐసీడీఎస్ పీడీ బీ హేనాసుజన్ చేతుల మీదుగా బిడ్డను కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం తల్లిదండ్రులకు అప్పగించారు.



2015లో నెల్లూరు నగర నడిబొడ్డు మద్రాస్ బస్టాండ్ సెంటర్‌లో వరద ముంపు (ఫైల్)



నెల్లూరు శివారులో నీట మునిగిన నివాసాలు (ఫైల్)



మూలాపేటలోని ఓ వీధిలో నీళ్లు (ఫైల్)

ముంపు ముప్పు

వర్షం వస్తే నెల్లూరుకు వణుకు

- నగరంలో వరద నీరు పోయే 16 కాలువల ఆక్రమణ
- 2015లో నగర నడిబొడ్డు ప్రాంతాల్లో నడుంలోతు నీరు
- అప్పట్లో వారం రోజులుగా నీటిలోనే లోతట్టు ప్రాంతాలు
- రూ.150 కోట్లకు పైగా నష్టం
- అప్పట్లోనే ఆక్రమణలు తొలగిస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు
- అడుగు ఆక్రమణలు కూడా తొలగించని ఆనాటి టీడీపీ ప్రభుత్వం
- విజయవాడ విలాపం చూసైనా కనువిప్పు కలుగుతుందా?

సింహపురి సుమారు 225 సంవత్సరాల చరిత్రాత్మక నగరం. అంతకు ముందు నుంచే పెన్నానది ఉంది. అప్పుడూ భారీ తుఫాన్లు, వర్షాలు, వరదలు వచ్చాయి. భారీ వరదలొచ్చినా.. పెన్నానది పరివాహక లోతట్టు ప్రాంతాలు మాత్రమే నీట మునిగేవి. కానీ తొలిసారిగా 2015 నవంబర్‌లో నెల్లూరు నగర నడిబొడ్డు నడుములోతు నీటిలో ముంపునకు గురైంది. దాదాపు ఇరవై ఏళ్ల నుంచి నగరం మీదుగా వరద వెళ్లే వరవ కాలువలు ఆక్రమణలకు గురికావడంతోనే ఈ పరిస్థితి దాపురించింది. ఈ విపత్తును పరిశీలించిన అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నెల రోజుల్లో ఆక్రమణలు తొలగిస్తామని ఇచ్చిన హామీని ఆ తర్వాత విస్మరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆక్రమణలు తొలగించేందుకు చేపట్టిన ప్రధానమైన సర్వేపల్లి కాలువ ఆధునికీకరణ పనులను టీడీపీ, జనసేన నేతలు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారు. ఆ ఆక్రమణలు అలాగే ఉన్నాయి. తాజాగా విజయవాడ పరిస్థితి చూసి.. నెల్లూరు నగర ప్రజలు పాత జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకుని వర్షం అంటేనే వణుకుతున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: విజయవాడ వరద విలయంతో జనజీవనం కకావికలమైన పరిస్థితి చూస్తుంటే గుండె చెరువవుతోంది. పది రోజులుగా లక్షలాది మంది నగర వాసులు నీళ్లతోనే ఉండిపోయి ఆకలి దప్పికలతో అలమటిస్తున్నారు. ఉన్నోళ్లు, పేదోళ్లు అనే తేడా లేకుండా అందరూ నీటిలో విలవిలలాడిపోతున్నారు. ఇలాంటి పరిస్థితి నెల్లూరు నగర ప్రజలు 9 ఏళ్ల క్రితం అనుభవించారు. గతంలో నెల్లూరు, ప్రస్తుతం విజయవాడ పరిణామాలు చూసైనా ప్రభుత్వం కళ్లు తెరవకపోతే మరోసారి సింహపురికి పెనుముప్పు తప్పదని నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. నెల్లూరు నగరంలో వర్షాకాలం వచ్చిందంటే చాలు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్ని కాలనీల్లో పీకల్లోతు నీరు నిలుస్తోంది. స్వర్ణాల చెరువు నుంచి వస్తున్న వరద నగరాన్ని ముంచేస్తోంది.

కబ్జా కోరల్లో 16 కాలువలు

నగరంలో దశాబ్దాల క్రితం నెల్లూరు చెరువు నుంచి పంటలకు సాగు కోసం గతంలో 16 పంట కాలువలు ఏర్పాటు చేశారు. గతంలో వేల ఎకరాలకు సాగునీరు అందించేవి. కాలక్రమేణా నగరం అభివృద్ధి చెందడంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకోవడంతో పంట భూముల్లో భవంతులు వెలిశాయి. దీంతో ఆయా కాలువల్లో మురుగు నీటి ప్రవాహం సాగుతోంది. నగరంలో అంకణం విలువ రూ.లక్షల్లో ఉండడంతో కొందరు కబ్జాదారులు కళ్లు కాలువలపై పడ్డాయి. ఆ కాలువలను ఆక్రమణ చేసి భారీ భవంతులు నిర్మించేశారు. ఒకరిని చూసి మరొకరు ఇలా పంట కాలువలను కబ్జా చేయడంతో కుచించుకుపోయాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే కాలువల ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ప్రధానంగా నగరంపై పడే వర్షపునీరుతో పాటు స్వర్ణాల చెరువు నుంచి వచ్చే వరద నీరంతా సర్వేపల్లి కాలువ, జాఫర్ సాహెబ్ కాలువల ద్వారా దిగువకు వెళ్లిపోతోంది. ఈ కాలువలను ఆక్రమించి కట్టడాలు కట్టేయడంతో అవి కుచించుకుపోయాయి. ప్రధానంగా హరనాథపురంలో ప్రముఖ విద్యా సంస్థ సర్వేపల్లి కాలువను ఆక్రమించి కట్టడాలు చేసింది. ఇలా నగరంలోని కాలువలపై దాదాపు 7 వేల వరకు అక్రమ కట్టడాలు ఉన్నాయని గత ప్రభుత్వం లెక్కలు తేల్చింది. దీన్ని బట్టి కబ్జా పర్వం ఎలా కొనసాగిందో తేట తెల్లమవుతోంది.



నగరంలోని మన్సూర్‌నగర్‌లో పంట కాలువను ఆక్రమించి చేపట్టిన బహుళ అంతస్తుల భవన నిర్మాణం

మూడు అడుగులకే పరిమితం

నగరంలో ఉన్న రామిరెడ్డి కాలువ, జాఫర్‌సాహెబ్ కాలువ, పీటర్‌సన్ కాలువ, మల్లపు కాలువ, ఉయ్యాల కాలువ, గచ్చుకాలువ తదితర 14 కాలువలు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితికి వచ్చాయి. ఆ కాలువలు ఇరిగేషన్, రెవెన్యూ రికార్డులు ప్రకారం చూస్తే దాదాపు 60 అడుగుల వెడల్పు కలిగి ఉండాలి. అంత వెడల్పు ఉన్న కాలువల స్వరూపం పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం ఈ కాలువల వెడల్పు 6 అడుగుల మేరకు చేరాయి. వెడల్పు తగ్గడంతో పాటు ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు కాలువలపై భవంతులకు అవసరాల తగ్గట్టు కాలువ పారుదల స్వభావాన్ని మార్చేసుకున్నారు. కొందరు కాలువ పోరంబోకు స్థలాలకు కూడా నకిలీ రికార్డులు సృష్టించి రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నారు. కాలువ పక్కన స్థలం ఉంటే చాలు పోరంబోకు భూమిని కలిపేసుకుని 6 అడుగుల మేర కాలువ ఉంచి ఆపై భారీ కట్టడాలు నిర్మించుకుంటున్నారు.

2015లో ఏం జరిగింది..

టీడీపీ హయాం 2015లో వచ్చిన వరద నగర వాసులకు వారం రోజుల పాటు కంటిపై కునుకు లేకుండా చేసింది. భారీ వరదతో నగరంలోని నడిబొడ్డుతో సహా సగం ప్రాంతం మునిగిపోయింది. వేల కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ట్రంకు రోడ్డులో గాంధీబొమ్మ సెంటర్, మద్రాస్‌బస్టాండ్ సెంటర్, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోల్ బంకు ప్రాంతాలతో పాటు మూలాపేట, సంతపేట, మన్సూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ముంపునకు గురైన కాలనీల్లోకి వెళ్లాలంటే అధికారులు బోట్లు వాడాల్సి వచ్చింది. నగర పరిధిలో దాదాపు 52 కిలోమీటర్ల రహదారులు దెబ్బతిన్నాయి. 900 పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. నగరపాలక సంస్థకు రూ.100 కోట్ల వరకు నష్టం జరిగింది. అప్పటి సీఎం చంద్రబాబు రెండు రోజులు హడావుడి చేసి నెల రోజుల్లోనే ఇంతటి దుస్థితికి కారణమైన ఆక్రమణలను తొలగించి నగరానికి ముంపు వాటిల్లకుండా శాశ్వత పరిష్కారం చేస్తానని చెప్పిన మాటలు తన ఐదేళ్ల పాలనలో నీటి మూటలుగానే మిగిలిపోయాయి. ప్రస్తుతం విజయవాడ పరిస్థితిపై కూడా చంద్రబాబు ఇలాంటి ప్రకటనలే చేస్తున్నారు. రాబోయే రెండు నెలలు జిల్లాకు భారీ వర్షాలు, వరదల ముప్పు పొంచి ఉంది.

డివిజన్లు - 54	జనాభా - దాదాపు 8 లక్షలు
నగరంలో వెళ్లే పంట కాలువలు - 16	విస్తీర్ణం - 150 చ.కి.మీ.

వైఎస్సార్‌సీపీ పాలనలోనూ వరదలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2019 నుంచి ఏటా వరుసగా భారీ వర్షాలు, వరదలు వచ్చాయి. కానీ కేవలం గంటల వ్యవధిలోనే వరద నీటిని బయటకు పంపించే చర్యలు చేపట్టింది. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆక్రమణలు తొలగించలేకపోయినా.. కాలువుల్లో పేరుకుపోయిన పూడికను తొలగించడంతో వరద నీరు త్వరగా బయటకు వెళ్లిపోయింది. సర్వేపల్లి, జాఫర్‌సాహెబ్ కాలువలను ఆధునికీకరణకు చర్యలు చేపట్టింది. సర్వేపల్లి కాలువపై ఉన్న ఆక్రమణలు తొలగిస్తూ ఆధునికీకరణ పనులు చేపడుతుంటే.. టీడీపీ, జనసేన పార్టీలు కలిసి కోర్టుల్లో కేసులు వేసి ఆ పనులు జరగకుండా అడ్డుకున్నాయి. దీంతో ఆ ఆక్రమణలు తొలగించలేని పరిస్థితి ఏర్పడింది. 2021లో పెన్నా వరద ప్రవాహం పోటెత్తింది. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు వచ్చింది. గత ప్రభుత్వం ముందస్తు చర్యల ఫలితంగా పెద్దగా ఆస్తి నష్టం జరగలేదు. లోతట్టు ప్రాంతాల్లో నివాసమున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించి భోజనవసతి కల్పించి తక్షణ సాయం కింద రూ.2 వేల నగదుతో పాటు వంట సరుకులు పంపిణీ చేశారు.



పొగతోటలో భవనాలతో ఆక్రమణకు గురైన గచ్చుకాలువ, పూడిక తీయకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయిన దృశ్యం

ఆక్రమణలు తొలగింపునకు ప్రతిపాదనలు

స్వర్ణాల చెరువు నుంచి వర్షపు నీరు నగరంలోకి రాకుండా పెన్నానదిలోకి మళ్లించాలి. నగర పరిధిలో ఉన్న 16 పంట కాలువలపై దాదాపు 7 వేలకు పైగా ఆక్రమణలను తొలగించి పేదలకు మరో చోట ఇళ్లు కేటాయించాలి. 60 అడుగుల వెడల్పుతో కాలువలను బాగు చేయాలి. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలి.

- ➡ స్వర్ణాల చెరువు నుంచి నగరంలోకి వచ్చే కలుజును మూసివేయాలి. మరో మార్గంలో వర్షపు నీరు పెన్నాలో కలిసేలా చేయాలి.
- ➡ ప్రస్తుతం చెరువులో నీరు పొట్టేపాళెం వెళ్లే మార్గంలో రోడ్డుపై నుంచి పెన్నాలో కలపడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. చెరువు నుంచి పెన్నా నదికి నీరు వెళ్లే కాలువల్లో పూడిక తీస్తే నీటి ప్రవాహం వేగంగా వెళ్తుంది.
- ➡ కాలువల విస్తరణకు గతంలో దాదాపు రూ.70 కోట్లు నిధులు కేటాయించారు. ఆయా పనులను పూర్తి కాలేదు.
- ➡ కాలువల విస్తరణతోపాటు రూ. 564.84 కోట్ల హడ్కో నిధుల సాయంతో చేపట్టిన మురుగునీటి డ్రైనేజీని పూర్తి చేయాల్సి ఉంది.



నీలగిరి సంఘం వద్ద ఆక్రమణకు గురైన పంట కాలువ






నగరంలోని శివగిరికాలనీ ప్రాంతంలో ఆక్రమణకు గురై, పూడికతో నిండిపోయిన పంట కాలువ



పాతపెద్దాసుపత్రి వద్ద ఆక్రమణకు గురైన ఉయ్యాల కాలువ

వరద మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే

- సహాయక చర్యల్లో చంద్రబాబు వైఫల్యం
- అసమర్థతను కప్పి పుచ్చుకోవడానికే డైవర్షన్ పాలిటిక్స్
- మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ మంత్రికాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (బారకాసు): 'చంద్రబాబు అసమర్థ పాలకుడు. గతంలోనూ, ఇప్పుడు ఏ విపత్తులోనూ పబ్లిసిటీ కోసం నానా హంగామా అంతే తప్ప వరద బాధితులకు చేసింది ఏమీ లేదు. ఏదో చేస్తున్నట్లు ఎల్లో మీడియాలో విస్తృత ప్రచారం తప్ప బాధితులకు జరిగిందేదీ లేదు. ఇంతకంటే ఎక్కువ విపత్తులు దివంగత సీఎం వైఎస్సార్ హయాంలోనూ, ఆ తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వచ్చాయి. అయితే వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడమే కాకుండా.. బాధితులకు అండగా నిలిచిన చరిత్ర వారిది. ఈ రోజు విజయవాడలో వరద మరణాలన్నీ కచ్చితంగా ప్రభుత్వ హత్యలే. ముందస్తు హెచ్చరికల్లో ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నెపం నెట్టేందుకు చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారంటూ' మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇకనైనా వరద బాధితులపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతసేపూ గత ప్రభుత్వాన్ని, జగన్‌ను నిందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, తమ పార్టీ నేతలను టార్గెట్ చేసి కేసులతో వేధించడం సీఎం చంద్రబాబు దిన చర్యగా మారిందని దుయ్యబట్టారు. బుడమేరుకు సరిగ్గా 60 ఏళ్ల క్రితం వరద వచ్చినా అప్పట్లోనే పది మంది మరణించిన విషయాన్ని ప్రస్తావించిన కాకాణి, ఇవన్నీ చంద్రబాబుకు తెలియదా? అని ప్రశ్నించారు. రియల్ టైం గవర్నెన్స్ అంటూ గప్పాలు కొట్టుకునే చంద్రబాబు ఇవన్నీ ముందే ఎందుకు పసి గట్టలేదని ప్రశ్నించారు. కృష్ణా నదికి ఫ్లాష్ ఫ్లడ్స్ వస్తే ఫ్లడ్స్ కుషన్ ఎందుకు చేయలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు. ఇది ప్రభుత్వ వైఫల్యం కాదా? అని నిలదీశారు. ఇరిగేషన్ శాఖ ప్రభుత్వానికి అలెర్ట్ ఇచ్చినా చంద్రబాబుకు ప్రజల ప్రాణాలంటే లెక్క లేకపోవడం వల్లే ఇంత మంది ప్రాణాలు కోల్పోయారని, ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనన్నారు. లక్షలాది జనాన్ని గాలికొదిలేసి, చంద్రబాబు మాత్రం తన అక్రమ కట్టడం నుంచి పారిపోయి కలెక్టరేట్‌ను పునరావాస కేంద్రంగా మార్చుకున్నారన్నారు. జనాన్ని మాత్రం తరలించలేదని, పైగా తన ఇల్లు మునిగిపోయిందంటే పరువు పోతుందని కలెక్టరేట్‌లో ఉంటూ కలరింగ్ ఇచ్చారని కాకాణి ఎద్దేవా చేశారు. వర్షాలు వరదల వల్ల ఉద్యాన పంటలు లక్షలాది ఎకరాలు నీట మునిగాయన్నారు. గతంలో తమ ప్రభుత్వంలో ఇలా జరిగితే వెంటనే రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. చంద్రబాబు తక్షణమే రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజల దృష్టి మళ్లించడానికి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ మొదలు పెట్టారన్నారు. ఎక్కడి బోట్లు కొట్టుకువస్తే.. దానికి వైఎస్సార్‌సీపీకి ముడి పెట్టడం కుట్రలో భాగమేనన్నారు. చంద్రబాబుకు భజన చేసే మీడియా జాకీలు పెట్టి మరీ బాకాలు ఊదుతోందని, ఆయన ప్రాణాలు ఫణంగా పెట్టి వరద ప్రాంతాల్లో తిరుగుతున్నారని ఊదరగొడుతున్నాయని ఆక్షేపించారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీలు ప్రసాద్, మందల వెంకటశేషయ్య పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో వసూళ్ల పర్వం

సూపర్‌వైజర్ల దోపిడీ

- ప్రతి బిల్లుకూ 10 శాతం కమీషన్
- అల్లాడిపోతున్న అంగన్‌వాడీ టీచర్లు

ఉలవపాడు: ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అవినీతిమయంగా మారింది. సూపర్‌వైజర్లు లంచావతారాలుగా మారి అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద వసూళ్లకు పాల్పడు తున్నారు. ప్రతి నెలా కచ్చితంగా మామూళ్లు ఇవ్వాల్సిందే. లేనిపక్షంలో ఆ సెంటర్‌పై కక్ష కట్టి తరచూ తనిఖీలు చేసి వారిని వేధిస్తున్నారు. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త నెలకు జీతం వచ్చినా రాకపోయినా సూపర్‌వైజర్లకు రూ.200 చెల్లించాలి. ఒక వేళ కార్యకర్తలకు సెలవు కావాల్సి వస్తే రూ.500 సంబంధిత సూపర్‌వైజర్‌కు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా అంగన్‌వాడీ కార్యకర్తల నుంచి ప్రతిదానికి వసూళ్లు చేస్తున్నా రు. కొందరు అంగన్‌వాడీలు సక్రమంగా కేంద్రాలు నిర్వహించడం లేదని వారి వద్ద నుంచి ప్రతి నెలా సూపర్‌వైజర్లు మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇక అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్యాస్ బిల్లు, కూరగాయలు, తాలింపు బిల్లులు వస్తాయి. ఈ బిల్లులకు సంబంధించిన నగదు ఇవ్వాలంటే ప్రాజెక్టు కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి బిల్లులో 10 శాతం కమీషన్ చెల్లించాల్సిందే. ఇటీవల 5 శాతం మాత్రమే ఇస్తామని కార్యకర్తలు, 10 శాతం ఇవ్వాల్సిందే అని కార్యాలయ సిబ్బంది మధ్య వివాదం కూడా జరిగింది. చివరకు అడిగినంత ఇవ్వక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి.

184 అంగన్‌వాడీ కేంద్రాలు

ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలో కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం మూడు మండలాలు ఉన్నాయి. ఈ మూడు మండలాల పరిధిలో మొత్తం 184 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 28 మినీ అంగన్‌వాడీ కేంద్రాలుగా పనిచేస్తున్నాయి. ఈ 184 కేంద్రాల వారు నెలకు రూ.36,800 సూపర్‌వైజర్లకు నెలమామూళ్లు అందిస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో ఏడుగురు సూపర్‌వైజర్లు ఉన్నారు. వీరికి జీతం కాక సెలవుల నగదు, కమీషన్లలో లంచం, తనిఖీలకు వస్తే లంచాలు ఇస్తున్నారు. జీతం కాక అదనంగా మరో పదివేల రూపాయలు అదనంగా తీసుకుంటున్నారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు కోడిగుడ్లు, పాల ప్యాకెట్లు, పిల్లలకు అందించే సరుకులు బయట అమ్మి వారికి లంచాలు ఇస్తున్నారు. ఈ విషయమై ఉలవపాడు ఇన్‌చార్జి సీడీపీఓ అరుణ వివరణ కోరడానికి ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

ఓ బొజ్జ గణపయ్యా.. వీడ్కోలయ్యా..

గణేశ్ మహారాజ్‌కీ జై.. గణపతి బొప్పా మోరియా.. అనే నినాదాలతో నెల్లూరు మార్మోగింది. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని నెల్లూరులో విగ్రహాల నిమజ్జన కార్యక్రమం సోమవారం కోలాహలంగా జరిగింది. ఊరేగింపుగా నెక్లెస్ రోడ్డులోని గణేశ్ ఘాట్ వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో సందడి నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





విగ్రహాలను తీసుకెళ్తూ..



వచ్చే ఏడాది కలుద్దాం : గణపయ్య విగ్రహాల నిమజ్జనం



కోలాహలం నడుమ ఊరేగింపు

కాళ్లరిగేలా తిరుగుతున్నాం

- కలెక్టరేట్‌కు పెద్ద ఎత్తున విచ్చేసిన జనం
- ఉన్నతాధికారులకు అర్జీల అందజేత
- ధాన్యం ధరలు తగ్గడంపై ఆందోళన

నెల్లూరు(దర్గామిట్ట): 'కాళ్లరిగేలా తిరుగుతున్నాం. మా మొర ఆలకించి సమస్యలు పరిష్కరించండి సారూ..' అంటూ ప్రజలు ఉన్నతాధికారులను వేడుకున్నారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు విచ్చేశారు. వారి నుంచి కలెక్టర్ ఆనంద్, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి, డీటీసీ చందర్ వినతిపత్రాలు స్వీకరించారు.



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆనంద్

గిరిజన ఉద్యోగికి న్యాయం కోసం..

కావలి తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న గిరిజనుడైన చలంచర్ల సాయిబాబాకు న్యాయం చేయాలి. ఉద్యోగ విరమణ, సర్వీస్ రిజిస్టర్ విషయంలో సానుకూలంగా స్పందించాలి.

– కేసీ పెంచలయ్య, కొప్పోలు రఘు, యానాదుల సంక్షేమ సంఘం

ధాన్యం ధరలు తగ్గిపోయాయి

జిల్లాలో ధాన్యం ధరలు తగ్గుతున్నాయి. వరి కోతలు మొదలై 15 రోజులు కాకముందే ధరలు తగ్గుతున్నాయి. పుట్టి ధాన్యం ధర రూ.17 వేలకు పడిపోయింది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తక్కువ విస్తీర్ణంలో వరిసాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మద్దతు ధర అందించేలా చర్యలు తీసుకోవాలి.

– రైతు సంఘాల సమాఖ్య ప్రతినిధి చిరసాని కోటరెడ్డి తదితరులు

నూతన భవనం ప్రారంభించాలి

మైనారిటీ గురుకుల పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించాలి. నెల్లూరు ఆటోనగర్ ప్రాంతంలో మైనారిటీ గురుకుల పాఠశాలను కొన్ని సంవత్సరాలుగా ప్రైవేట్ భవనంలో నడుపుతున్నారు. అది చాలా పురాతనమైనది కావడంతో 300 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ భవనం పారిశ్రామిక వాడ ఏరియాలో ఉన్నందువల్ల కాలుష్యం ఎక్కువై పిల్లలు తరచూ అనారోగ్యం పాలవుతున్నారు. కొత్తూరు అక్కచెరువుపాడులో 10 ఎకరాల్లో రూ.15 కోట్లతో మైనారిటీ గురుకుల పాఠశాల నూతన భవనం త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు

వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలి

వర్షాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇసుక కోసం పెన్నా కరకట్టలను ఎక్కడబడితే అక్కడ తెగ్గొట్టేశారు. భారీ వర్షాలు కురిస్తే జిల్లాలోని చెరువులన్నీ తెగిపోయే ప్రమాదం ఉంది. నెల్లూరు నగరంలో ప్రవహించే 14 కాలువలు పూర్తిగా కనుమరుగయ్యాయి. జాఫర్ సాహెబ్, సర్వేపల్లి, కృష్ణపట్నం కాలువలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. కొద్దిపాటి వర్షానికి నగరం జలమయమయ్యే ప్రమాదముంది. సోమశిల ఆప్రాన్ పనులు ఇంకా పూర్తికానందున వరదలు వస్తే ఆ ప్రాజెక్ట్ మనుగడ ప్రశ్నార్థకంగా ఉంది. ప్రభుత్వం తక్షణమే వీటిపై చర్యలు తీసుకోవాలి.

– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

వేధింపులు ఆపాలంటూ..



ధర్నా నిర్వహిస్తున్న ఆశావర్కర్ల యూనియన్ సభ్యులు తదితరులు

ఉద్యోగ భద్రత కల్పించాలని, కలిగిరి మండలం రావులకొల్లు ఆశావర్కర్ విజయమ్మపై గ్రామ సర్పంచ్ రాజకీయ వేధింపులను నియంత్రించాలంటూ ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ రావులకొల్లు గ్రామంలో ఆశావర్కర్‌గా 18 సంవత్సరాలుగా పనిచేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న విజయమ్మను రాజకీయ కక్షతో వేధిస్తూ ఉద్యోగం నుంచి తొలగించేలా సర్పంచ్ వెంగప్పనాయుడు కుట్ర చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులను సైతం తప్పుదోవ పట్టిస్తూ ఆమెపై ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సేవలందించిన విజయమ్మపై వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కలిగిరి పీహెచ్‌సీతోపాటు ఇసుకపాళెం, ముత్తుకూరు పీహెచ్‌సీల పరిధిలో కూడా ఆశావర్కర్లపై రాజకీయ వేధింపులున్నాయన్నారు. న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

మోసపోయాం

- ఎస్పీకి సమస్యలు తెలిపిన బాధితులు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 80 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగం ఇప్పిస్తానని ఒకరు.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇంకొకరు.. తక్కువ ధరకే భూమి, బంగారం ఇప్పిస్తానని మరికొందరు.. నకిలీ పత్రాలతో ఇళ్లు అమ్మారని పలువురు... ఇలా పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. మోసగాళ్లపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను కోరారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. 80 మంది తమ సమస్యలపై ఎస్పీకి ఫిర్యాదులు చేశారు. పరిశీలించిన ఆయన చట్టపరిధిలో వాటిని సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, డీటీసీ ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

పెళ్లి చేసుకుంటానని నమ్మించి..

వేదాయపాళెంలో నా మేనమామ ఉన్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా లోబర్చుకుని మోసం చేశాడు. అతని కుటుంబ సభ్యులకు విషయం తెలిపినా పట్టించుకోవడం లేదు.

– హైదరాబాద్‌కు చెందిన మహిళ

నకిలీ పత్రాలు సృష్టించి..

మా అమ్మ చనిపోయింది. ఆమెకు వారసులు లేరని మా చిన్నాన్న మోహన్ నకిలీ పత్రాలు సృష్టించి ఇంటిని అమ్మేశారు. విచారించి న్యాయం చేయాలి.

– నెల్లూరు దర్గామిట్ట వాసి

ఉద్యోగం పేరిట మోసం

టెలిగ్రామ్ యాప్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. ఉద్యోగం ఇప్పిస్తానని రూ.8.61 లక్షల నగదు తీసుకున్నాడు. టాస్క్‌ల ద్వారా అధిక మొత్తంలో సంపాదించవచ్చని మభ్యపెట్టి ఇంకా నగదు పంపాలని వేధిస్తున్నాడు. ఉద్యోగం విషయమై నిలదీసేందుకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అతడిపై చర్యలు తీసుకోవాలి.

– ధనలక్ష్మీపురం వాసి

తక్కువ ధరకే..

బుచ్చికి చెందిన మస్తాన్ అతని అనుచరులు తక్కువ ధరకే భూమి, బంగారం ఇప్పిస్తానని నమ్మబలికారు. దీంతె నేను రూ.65 లక్షలు ఇచ్చాను. నెలలు గడుస్తున్నా భూమి, బంగారం ఇప్పించలేదు. ఈ విషయంపై విచారించి చర్యలు తీసుకోవాలి.

– అనంతసాగరానికి చెందిన మహిళ

నగదు ఇవ్వలేదు

ఏఎస్‌పేటకు చెందిన మహేష్‌రెడ్డి రూ.22 లక్షలు విలువ చేసే ధాన్యాన్ని నాతోపాటు రైతుల వద్ద నుంచి తీసుకున్నాడు. ఇప్పటి వరకు నగదు ఇవ్వలేదు. అడిగితే దౌర్జన్యం చేస్తున్నాడు.

– కొండయ్య, సంగం

సాఫ్ట్‌వేర్ జాబ్ పేరుతో..

కలువాయికి చెందిన ఆర్.అనిల్ నెల్లూరు అయ్యప్పగుడి సెంటర్‌లో ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి కోచింగ్ ఇచ్చి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇపిస్తానని నమ్మబలికాడు. అతడికి రూ.3 లక్షలిచ్చాను. బంధువుల వద్ద సైతం రూ.1.20 లక్షలు ఇప్పించాను. కానీ ఉద్యోగం రాలేదు. తీరా విచారించగా అనిల్ ఎందరినో మోసగించాడని తెలిసింది. విచారించి న్యాయం చేయాలి.

– అల్లూరుకు చెందిన మహిళ

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి

కావలి: గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. కావలి పట్టణానికి చెందిన రమేష్ (25) అనే వ్యక్తి సోమవారం గణపయ్య విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మరణించాడు. అతను కూలి పనులు చేస్తుంటాడు. విగ్రహాన్ని స్థానికులతో కలిసి సముద్ర తీరానికి తీసుకెళ్తుండగా ప్రమాదం జరిగి మృత్యువాతపడ్డాడు. దీంతో విషాదం నెలకొంది.



రమేష్ మృతదేహం

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

కావలి: దగదర్తి మండలంలో జరిగిన హత్యకు కారణం వివాహేతర సంబంధమేనని కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ వెల్లడించారు. కావలి పట్టణంలోని కార్యాలయంలో సోమవారం ఆయన రూరల్ సర్కిల్ సీఐ పాపారావుతో కలిసి వివరాలు వెల్లడించారు. దగదర్తి మండలం ఐతంపాడు – రంగసముద్రం మధ్యలో చెరువు వద్ద ఈనెల ఒకటో తేదీన ఏఎస్‌పేటకు చెందిన నాగులూరు ప్రభయ్య (30) హత్యకు గురయ్యాడు. ఈ కేసును పోలీసులు విచారించారు. మృతుడికి గతంలో రెండు వివాహాలు జరిగాయి. కాగా ఐతంపాడుకు చెందిన మధు అనే వ్యక్తి సోదరితో వివాహేతర సంబంధం ఉంది. ప్రభయ్య ఏఎస్‌పేటతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని ఇతరులకు చెందిన పందులను అక్రమంగా పట్టి అమ్ముకోవడం, ప్రశ్నిస్తే దౌర్జన్యం చేయడం వంటి పనులను చేసేవాడు. తన పందులను అమ్మేయడం, సోదరితో సన్నిహితంగా ఉండడంతో మధు ప్రభయ్యపై కోపం పెంచుకున్నాడు. అతను, అరుణ్, సురేంద్ర, మహేంద్ర, తిరుపతయ్య, బలరామయ్య, బాలరాజు, దశయ్య తదితరులు ప్రభయ్యను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. వారంతా కలిసి ఐతంపాడుకు చేరుకుని ఏఎస్‌పేటలో ఉన్న ప్రభయ్యకు ఫోన్ చేసి పిలిపించారు. అతను వెళ్లగానే మూకుమ్మడిగా కర్రలతో కొట్టి చంపేశారు. మధు, అరుణ్, సురేంద్ర, మహేంద్ర, తిరుపతయ్యను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ చెప్పారు. మిగిలిన వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

పర్యాటక దినోత్సవంపై రీల్స్ పోటీలు

నెల్లూరు(దర్గామిట్ట): ఈనెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వీడియో, రీల్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటకాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక నిమిషం నిడివి గల వీడియోలు లేదా 15 నుంచి 30 సెకన్ల నిడివి గల రీల్స్ పంపాలన్నారు. ఉదయగిరి దుర్గం, మైపాడు బీచ్, లైట్‌హౌస్, జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారి ఆలయం, నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, పెంచలకోన నరసింహస్వామి, నెల్లూరులోని రంగనాథస్వామి ఆలయాలు, కండలేరు డ్యామ్, సోమశిల జలాశయం తదితర వాటి ఔన్నత్యం తెలిపేలా ఈనెల 22లోగా ఆన్‌లైన్‌లో వీడియోలు, రీల్స్ పంపాలన్నారు. మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు, ఐదుగురికి రూ.1,000 ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 98480 07024 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రైల్లో నుంచి పడి యువకుడి మృతి

కొడవలూరు: రైల్లో నుంచి పడి గుర్తుతెలియని యువకుడు మృతిచెందిన ఘటన తలమంచి – అల్లూరు రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కథనం మేరకు.. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో పట్టాల వద్ద యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 15 నుంచి 20 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. అతను తెలుపు రంగు టీషర్ట్, బ్లూ రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. శరీరంపై గాయాలను బట్టి రైల్లో నుంచి జారి పడి మృతిచెంది ఉండొచ్చని చెబుతున్నారు. వివరాలు తెలిసిన వారు 98483 43638 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.



యువకుడి మృతదేహం

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 121
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 244
లేయర్ చికెన్	: 178

